భక్తులకు జంపింగ్ కష్టాలు

- జాతీయ రహదారి రెయిలింగ్ దాటి వెళ్లేనే ముగ్గురు అమ్మవార్ల దర్శనం
- సర్వీసు రోడ్డులోకి మార్గం తెరవాలని డిమాండ్



సర్వీస్ రోడ్డును ఆనుకుని సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయాలు



ఆలయం ముందు నుంచి సర్వీస్‌రోడ్డు మీదుగా వెళ్తున్న భారీ వాహనం

తగరపువలస: దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగివలస కొత్తమ్మతల్లి (పోలమాంబ అలియాస్ ముగ్గురు అమ్మవార్ల) ఆలయానికి చేరుకునే భక్తులకు జాతీయ రహదారి రూపంలో కష్టాలు వెంటాడుతున్నాయి. సర్వీస్ రోడ్డును ఆనుకుని ఉన్న ఈ ఆలయాల్లోని అమ్మవార్లను హైవే మీదుగా వచ్చే భక్తులు దర్శించుకోవాలంటే తప్పనిసరిగా రెయిలింగ్ మీద నుంచి జంప్ చేయాల్సి ఉంటుంది. వృద్ధులు, మహిళలు ఈ కష్టాలు పడలేక హైవే మీద నుంచే దండం పెట్టుకుని వెళ్లిపోతుంటారు. హైవే నుంచి వచ్చే భక్తుల కోసం ఆలయం ముందు భక్తుల నడకకు సరిపడా రెయిలింగ్ తొలగించాలని పలువురు కోరుతున్నారు. సరిగ్గా ఆలయం ముందు నుంచే ఫ్లై ఓవర్ ప్రారంభమైనందున ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ నుంచి వచ్చే సిటీ సర్వీసులు సర్వీస్ రోడ్డులో నడుపుతున్నారు. దీంతో నిత్యం వందలాది సిటీ సర్వీస్‌లు ఆలయం ముందే నిలుపుతుంటారు. ఒక్కోసారి భారీ వాహనాలు సైతం సర్వీస్‌రోడ్డు ద్వారా రాకపోకలు సాగించినప్పుడు ఇరుకుగా ఉండే ఈ మార్గంలో భక్తులు గందరగోళానికి గురవుతున్నారు. ఈ నెల 5 నుంచి అమ్మవార్ల వార్షిక ఉత్సవాలు ప్రారంభమవుతున్నందున భక్తుల రద్దీతో సర్వీస్ రోడ్డుపై రాకపోకలు జటిలం కానున్నాయి.

సర్వీస్‌రోడ్డులోకి మార్గం లేక ఇబ్బందులు

విశాఖ నుంచి తగరపువలస మీదుగా విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్, సిటీ సర్వీస్‌లకు ముగ్గురు అమ్మవార్ల ఆలయం తర్వాత హైవే నుంచి సర్వీస్‌రోడ్డులోకి మార్గం తెరవాలని ప్రయాణికులు మూడేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. తగరపువలస వద్ద హైవే నుంచి సర్వీస్ రోడ్డులోకి మార్గం లేకపోవడంతో చాలా వరకు వాహనదారులు నేరుగా విజయనగరం జిల్లా పరిధిలోని రాజాపులోవ, పోలిపల్లి గ్రామాల వరకు వెళ్లి వెనక్కు తిరిగి రావాల్సి వస్తుంది. అంతేకాకుండా గతంలో ఈఎస్ఐ ఆస్పత్రి కూడలిని ఆనుకుని ఉన్న వ్యాపారాలు ఫ్లై ఓవర్ కారణంగా మూతపడ్డాయి. ఇదే కూడలిలో అయిదేళ్ల క్రితం వరకు అటు, ఇటు రాకపోకలు సాగించే బస్సులు నిలుపుదల చేయడం వల్ల ప్రయాణికులకు ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుతం కూడలి అనుకూలంగా లేకపోవడంతో తగరపువలస ప్రాంత ప్రజలు అటు వెంకటేశ్వరమెట్ట, ఇటు ముగ్గురు అమ్మవార్ల ఆలయాల వద్దకు చుట్టూ తిరిగి రెండు కిలోమీటర్లు దూరం నడిచి వెళ్లి బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. అందువల్ల ముగ్గురు అమ్మవార్ల ఆలయం వద్ద హైవే నుంచి సర్వీస్ రోడ్డులోకి మార్గం ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు. చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్, శ్రీబాసర లే అవుట్‌ల మధ్య విశాఖమైన ప్రాంతం ఉండటంతో గతంలో ప్రతిపాదించినట్టుగా బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రుద్రాక్షల అలంకరణలో సుత్తమ్మ తల్లి

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ గ్రామ దేవత సుత్తమ్మతల్లిని స్థానిక భవానీ పీఠం, ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం 83,160 రుద్రాక్షలతో అలంకరించారు. ప్రతీ నెల పౌర్ణమి ముందు రోజు వచ్చే బుధవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు పసుపు కొమ్ములు, నెమలిపింఛాలు, తులసి, వివిధ రకాల పుష్పాలు, వాక్కాయ, అరటి, కొబ్బరి, గాజులు, ద్రాక్ష, యాపిల్, మామిడి, చెరకు, కూరగాయలతో అలంకరించారు. ఈ నెల అలంకరణలో భాగంగా వారణాసి నుంచి తీసుకొచ్చిన రుద్రాక్షలను 108 వంతున 770 దండలు కట్టి అమ్మవారి విగ్రహంతోపాటు ఉత్సవ విగ్రహానికి కూడా అలంకరించారు. ఈ రుద్రాక్షలు వారణాసి నుంచి తీసుకురావడానికి రూ.50 వేలు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు సందర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



రుద్రాక్షలతో అలంకరించిన సుత్తమ్మ తల్లి విగ్రహం

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 22 మంది ఎంపిక

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఫార్మసీ కళాశాలలో బుధవారం జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 22 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. మెడీ అసిస్ట్ టీపీఏ ఇండియా నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 60 మంది పాల్గొనగా 22 మంది విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎంబీవీ రాజు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ వి.ఉమా శంకర్, ఏవో సంతోష్‌కుమార్ తదితరులు అభినందించారు.



ఎంపికైన అవంతి ఫార్మసీ కళాశాల విద్యార్థులతో సిబ్బంది

క్లుప్తంగా

స్థలాల లాటరీ బహిష్కరణ

పద్మనాభం: మండలంలోని నేరేళ్లవలసలో స్థలాలు కేటాయించేందుకు రెవెన్యూ అధికారులు లాటరీ వేయడానికి బుధవారం సిద్ధమవగా రైతులు బహిష్కరించారు. తునివలస పంచాయతీ నరసాపురం రైతులు 22 మంది నుంచి అధికారులు ల్యాండ్ పూలింగ్‌లో భూములు తీసుకున్నారు. వాటికి ప్రత్యామ్నాయంగా నేరేళ్లవలసలో స్థలాలు ఇవ్వడానికి తహసీల్దార్ కె.వేణుగోపాలరావు, రెవెన్యూ సిబ్బంది లాటరీ వేయడానికి సిద్ధమయ్యారు. అయితే తమకు రోడ్డుకు దూరంగా స్థలాలు ఇస్తున్నారంటూ రైతులు లాటరీని బహిష్కరించడంతో రెవెన్యూ అధికారులు వెనుదిరిగారు.

బావిలో వృద్ధురాలి మృతదేహం

పద్మనాభం : రెడ్డిపల్లిలో అదృశ్యమైన వృద్ధురాలు బావిలో శవమై కనిపించిందని ఎస్ఐ భరత్‌కుమార్ రాజు తెలిపారు. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వాడపల్లి సరస్వతి (82) సోమవారం సాయంత్రం నుంచి కనిపించలేదు. వయోభారం తట్టుకోలేక రెడ్డిపల్లిలోని తమ పొలంలోని బావిలో పడి మృతి చెందింది. మృతురాలు సరస్వతి మనవడు సత్యనారాయణ బుధవారం ఉదయం 6.30 గంటల సమయంలో బావిలో అమ్మమ్మ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత జేపీఎల్ జట్టు



ట్రోఫీతో జేపీఎల్ జట్టు క్రీడాకారులు

తగరపువలస: చిట్టివలస మెడోస్ స్పోర్ట్స్ విలేజ్‌లో గత నెల 16 నుంచి 28 వరకు అండర్ – 13 బాలురు, అండర్ – 15 బాలికల విభాగంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు నిర్వాహకులు బుధవారం ట్రోఫీలు అందించారు. ఈ రెండు విభాగాల్లో టోర్నమెంట్ విన్నర్స్‌గా జేపీఎల్ జట్టు నిలిచింది. ముఖ్య అతిథిగా రంజీ ప్లేయర్ కమ్ కోచ్ చంద్రశేఖర రావు, అంపైర్స్ ఇన్‌చార్జి జోగారావు విన్నర్స్, రన్నర్స్ జట్లకు ట్రోఫీలు అందించారు. మెడోస్ స్పోర్ట్స్ విలేజ్ నిర్వాహకులు డి.ప్రకాష్, డాక్టర్ చల్లారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజేతలకు నగదు పంపిణీ



విజేతలకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పద్మనాభంలో రెండు రోజులపాటు నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతలకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు బుధవారం నగదు బహుమతులు అందజేశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన భీమునిపట్నం, పద్మనాభం, భీమునిపట్నం – 2 జట్లకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు పాల్గొన్నారు.

అలరించిన భక్తి రంజని



భక్తి గీతాలు ఆలపిస్తున్న స్వరరంజని బృంద సభ్యులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం స్వరరంజని ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన భక్తులను ఆకట్టుకుంది. వేంకటేశ్వర స్వామిని స్తుతిస్తూ ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. సంస్థ అధ్యక్షురాలు లతారాములు, ప్రధాన కార్యదర్శి కోరుకొండ రంగారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో మొక్కజొన్నలో అధిక దిగుబడి

తగరపువలస: సస్యరక్షణతో మొక్కజొన్నలో అధిక దిగుబడి సాధించవచ్చని డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు సూచించారు. భీమిలి మండలం దాకమర్రి గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలంబడిలో మొక్కజొన్నలో సస్యరక్షణకు డాట్ సెంటర్ సీనియర్ శాస్త్రవేత్త బి.భవానీ, డీఆర్సీ ఏడీఏ చదువుల సుబ్రహ్మణ్యం, భీమిలి ఏడీ బి.విజయప్రసాద్, ఏవో బి.శివకోమలి పలు సూచనలు చేశారు.

మొక్కజొన్న క్షేత్ర పరిశీలనలో భాగంగా ఆకు ఎండు తెగులు, కత్తెర పురుగు ఎక్కువగా సోకినట్టు గుర్తించారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. మిరప పంటలో ముడత, కొమ్మ ఎండుతెగులు సోకిన మొక్కలకు లీటర్ నీటికి కాప్టాన్, హెక్సాకొనజాల్(తాకత్) 2 గ్రాముల చొప్పున ఎకరాకు 400 గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా గుర్తించినందున రబీ మొక్కజొన్న కోత అనంతరం ఖరీఫ్ వరి కంటే ముందు రాగి పంట సాగు చేసుకుని రైతులు ఆదాయం పొందాలని సూచనలు చేశారు. అలాగే నువ్వు పంటలను సందర్శించారు. చౌడు భూములు ఉన్న పొలాల్లో రబీ మొక్కజొన్న అనంతరం మట్టి నమూనాలు సేకరించి భూ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. దాకమర్రి వీహెచ్ఏ భాగ్యరేఖ, ఆర్బీకే వలంటీర్ చెల్లూరి వాణి, రైతులు కాళ్ల పద్మనాభం, అప్పలరాజు, అప్పలరాము తదితరులు పాల్గొన్నారు.



దాకమర్రిలో మొక్కజొన్న పంటలో సస్యరక్షణపై వివరిస్తున్న రైతు శాస్త్రవేత్తలు

ప్రమాదకరంగా శిథిల డ్రెయిన్లు

- జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో ఎక్కడ చూసినా ఇదే దుస్థితి
- క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది కూడలి వరకు అవస్థలు

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2లో పీఎం పాలెం ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది కూడలి వరకు జాతీయ రహదారి సర్వీసు రోడ్డును ఆనుకుని రెండు వైపులా డ్రెయిన్ల శ్లాబులు శిథిలమై డెబ్రిస్, మురుగుతో నిండిపోయాయి. మరికొన్ని చోట్ల విరిగిపోయి ప్రమాదకరంగా నోళ్లు తెరచి ఉన్నాయి. ఈ డ్రెయిన్ శ్లాబే ఫుట్‌పాత్ కూడా కావడంతో వృద్ధులు, విద్యార్థులు, పిల్లలు, మహిళలు భయంభయంగా నడుస్తున్నారు. అదుపు తప్పితే ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. గతంలో పత్రికల్లో వార్తలు ప్రచురితమవడంతో అధికారులు తూతూమంత్రంగా మరమ్మతులు చేసి వదిలేశారు. ఇప్పుడు మరింత ప్రమాదకరంగా తయారు కావడంతోపాటు డెబ్రిస్, మురుగుతో నిండిపోయాయి. మరమ్మతులు చేపట్టి, సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ, మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు గత కొద్ది రోజులుగా జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. రాకపోకలకు అవస్థలు పడుతున్నామని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



కార్‌షెడ్ కూడలిలో మురుగుతో ప్రమాదకరంగా ఉన్న డ్రెయిన్



జీవీఎంసీ జోన్ - 2 కార్యాలయం వద్ద విరిగిపోయిన శ్లాబు

సుధాకర్ గెలుపుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి

కొమ్మాది: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 8వ వార్డు రుషికొండ, సిల్వర్ ఓక్స్ పాఠశాలలో బుధవారం ఆయన ప్రచారం చేశారు. సీతంరాజు సుధాకర్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సుధాకర్ గెలుపునకు దోహద పడతాయన్నారు. కార్పొరేటర్ లొడగల అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, చెన్నాదాసు, లొడగల రామ్మోహన్, చెన్నా ఎల్లయ్య, మాదు చంటి పాల్గొన్నారు.

పీఎం పాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవడం మనందరి లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన పీఎం పాలెంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి వైఎస్సార్ సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విద్యావంతునిగా, వ్యాపారవేత్తగా చేస్తున్న సేవలు వివరించారు. రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, వైఎస్సార్ సీపీ 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, సియాద్రి కనకరాజు, పోతిన ప్రసాద్, ఎల్లాజీ, పిళ్లా సత్యనారాయణ, జామి శివకుమార్, సృజన స్కూల్ ప్రిన్సిపాల్ మహమ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

సీతంరాజుని గెలిపిస్తే నిరుద్యోగ సమస్య పరిష్కారం

ఆనందపురం : వైఎస్సార్ సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ని గెలిపిస్తే నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు అన్నారు. మండలంలోని గంభీరం, బోయిపాలెం, ఆనందపురం, లొడగలవానిపాలెం, పాలవలస, గొట్టిపల్లి, కుసులువాడ, బోని, చందక గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే సీతంరాజు సుధాకర్‌ని గెలిపించాలని కోరారు. ఈ మేరకు ఓటర్ల ఇంటికి వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, బోని అప్పలనాయుడు, బొట్టా రామకృష్ణ, పాండ్రంకి శ్రీను, కోరాడ ముసలినాయుడు, ఉప్పాడ సూరిబాబు, చందక లక్ష్మి, లొడగల వెంకట రమణ, రౌతు శ్రీను, మహంతి వెంకటలక్ష్మి, బంక శ్రీను, పాండ్రంకి అప్పారావు, లెంక రాంబాబు పాల్గొన్నారు.

పద్మనాభం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అభ్యర్థించారు. పద్మనాభంలోని గోస్తనీ విద్యాపీఠ్ లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతంరాజు సుధాకర్‌ను గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటారన్నారు. ప్రత్యేక అభిమానంతో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విశాఖపట్నంలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దీంతో విద్య, ఉపాధి అవకాశాలు పెరిగి ఉత్తరాంధ్ర ముఖ చిత్రం మారిపోతుందన్నారు. ఉపాధి కోసం బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి పారదర్శకంగా రాష్ట్రంలో 1.25 లక్షల మందికి సీఎం జగన్ ఉద్యోగాలు ఇచ్చారన్నారు. హనుమంతు లజపతిరాయ్, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ రెడ్డిపల్లి జగదీష్‌బాబు, ఆపష్ జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్ కుమార్ మాట్లాడుతూ సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, బోని సన్యాసినాయుడు, సిరుగుడి ఆదినారాయణ, ఈర్ల ఈశ్వరరావు, మొకర అప్పలనాయుడు, తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

సుధాకర్ తరఫున విస్తృత ప్రచారం

తగరపువలస: వైఎస్సార్‌సీపీ బలపరచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపును కోరుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు భీమిలి అర్బన్, రూరల్‌లో బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మండలంలోని పెదనాగమయ్యపాలెం, అన్నవరం, చిప్పాడ పంచాయతీల్లోని పాఠశాలల్లో ప్రచారం చేశారు. సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్‌లు మైలపల్లి ఎల్లాజీరావు, సూరిబాబు, పొట్నూరు చంద్రశేఖర్, సమ్మిడి శ్రీను, గాడు వెంకటనారాయణ, ఎంపీటీసీ సభ్యులు చెల్లూరి నగేష్, అప్పలరాజు, కేపీ సత్యనారాయణ పాల్గొన్నారు.

- జీవీఎంసీ ఒకటో వార్డులో అక్కరమాని రాము నాయుడు, జగుపల్లి ప్రసాద్, తమ్మిన రామలక్ష్మణ, చింతగుంట శివ, అక్కరమాని చినబాబు, రెండో వార్డులో చిల్ల భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి తదితరులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర శిష్ట కరణాల సంక్షేమ సంఘం మహిళ అధ్యక్షురాలు డబ్బీరు ప్రశాంతి, అరికతోట చంద్రమౌళి తదితరులు పాఠశాలల్లో ప్రచారం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



బోయిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



చిప్పాడలో సుధాకర్ తరఫున ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చిట్టివలసలో ప్రచారం చేస్తున్న నాయకులు



చిల్లపేటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాస్ పుస్తకాలపై బార్ కోడ్ ముద్రించాలి

తగరపువలస: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, చిట్టివలస బ్రాంచిలో నూతనంగా ఇస్తున్న పాస్ పుస్తకాలపై బార్‌కోడ్ ముద్రించి ఖాతాకు అనుసంధానం చేసి ఇవ్వాలని ఖాతాదారులు కోరుతున్నారు. గతంలో పాస్ పుస్తకాలు ఇచ్చినప్పుడు వేరుగా బార్‌కోడ్ స్టిక్కర్లు అంటించి ఖాతాకు అనుసంధానం చేసి ఇచ్చేవారు. దీంతో నిరక్షరాస్యులైన ఖాతాదారులు కూడా నేరుగా బ్రాంచిలో ఏర్పాటు చేసిన కియోస్క్‌ల ద్వారా ఖాతా లావాదేవీల వివరాలు ముద్రించుకుని బ్యాలెన్సు తెలుసుకునేవారు. ఇటీవల కొత్తగా ఇస్తున్న పాస్ పుస్తకాలపై ముద్రించిన బార్‌కోడ్‌లు ఉన్నప్పటికీ ఖాతాకు అనుసంధానం చేయడం లేదు. ఒక్కోసారి బార్‌కోడ్‌లు లేని పుస్తకాలు ఇస్తుండడంతో ఖాతాదారులు ఇబ్బంది పడుతున్నారు. బార్‌కోడ్‌లు లేవని సిబ్బంది చెబుతుండడంతో ఖాతాదారులు బ్రాంచి చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. బార్‌కోడ్‌లు లేకపోవడం, బ్రాంచి నిత్యం రద్దీగా ఉండటంతో ఖాతాదారులు తమ లావాదేవీలు తెలుసుకోలేకపోతున్నారు. బార్‌కోడ్‌లు ఇవ్వాలని సిబ్బందిని వేడుకుంటున్నారు.

పబ్లిక్ డిమాండ్

కుళాయి నీరు వృథా



సాయిరాం కాలనీలో వృథాగా పోతున్న తాగునీరు

తగరపువలస: జీవీఎంసీ 6వ వార్డు శ్రీనివాసనగర్, సాయిరాం కాలనీలో నాలుగు రోజులుగా తాగునీటి కుళాయిల నుంచి నీరు వృథాగా పోతోంది. కొమ్మాది కూడలి నుంచి సీఎంఆర్ స్థలం వెనుక ప్రాంతంలో తరచూ నీరు వృథాగా పోతోంది. దీనిని తక్షణమే అరికట్టాలి.

– అనిల్, సాయిరాం కాలనీ

విశ్వజనీనత ప్రతిబింబించేలా కవిత్వం

సీతంపేట: కవులందరూ కవిత్వ తత్వాన్ని అలవర్చుకోవాలని గజల్ గాయని జ్యోతిర్మయి మళ్ల అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనసులను కదిలించే ప్రేమ, జాలి, కరుణ, కళాత్మకత రంగరించి విశ్వజనీనత ప్రతిబింబించేలా కవిత్వం ఉండాలని సూచించారు. పలు గజల్స్ పాడి వినిపించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వాన్ని వివిధ పద్ధతుల్లో వ్యక్తీకరించవచ్చని, అందులో పద్యం, వచన కవిత, లఘు కవితా రీతులైన నానీలు, హైకూలు, రెక్కలు మొదలైన ప్రక్రియలే కాకుండా పారశీక ప్రక్రియ గజల్స్ బాగా ప్రాచుర్యం పొందాయన్నారు. అటువంటి గజల్స్ ప్రక్రియలో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బాగా పేరొందిన కవయిత్రి గజల్ గాయని జ్యోతిర్మయి మళ్ల అని కొనియాడారు. రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ ఇటీవల మరణించిన గజల్ కవయిత్రి భైరి ఇందిర గురించి, ఆమె కవిత్వంలోని విశేషాలను వివరించారు. సాహితీవేత్తలు, రచయితలు కె.వి.ఎస్.మూర్తి, డి.వి.సూర్యారావు, పి.ఎల్.వి.ప్రసాద్, చిన సూర్యనారాయణ, రామతాత, రమణకొత్తూరి కవితలు వినిపించారు.



మాట్లాడుతున్న గజల్ గాయని జ్యోతిర్మయి